పాముకాటుతో వ్యక్తి మృతి

పాపన్నపేట, మార్చి 12: పాముకాటుతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మీనగర్‌లో బుధవారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు నాగరాజు (53) కూలీ పనులు చేస్తూ, ఎక్కడైనా పాములు వస్తే వాటిని పట్టేవాడు. మంగళవారం కొత్తపల్లిలోని పద్మనాభస్వామి ఫంక్షన్ హాల్‌లో పామును పట్టే సమయంలో చేతికి కరిచింది. అక్కడి ఉన్న వారు గమనించి మెదక్ జిల్లా దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట, మార్చి 12: కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపల్లిలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన అవుసుల రాములు (40) కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు పడేవారు. ఈ క్రమంలో భార్య సరళ పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి దిగులు పడేవాడు. బుధవారం ఉదయం రోడ్డుపక్కన పురుగు మందు తాగి కిందపడిపోయాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగిపోయే గుండెకు ఊపిరి పోసిన వైద్యుడు

క్షతగాత్రుడిని తరలిస్తున్న స్థానికులు

రామాయంపేట, మార్చి 12: మండలంలోని ఝూన్సీలింగాపూర్‌కు చెందిన ప్రభాకర్‌రెడ్డి ద్విచక్ర వాహనం నడుపుతూ బుధవారం అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయమైంది. రక్తం మడుగులో కొట్టుకుంటున్న విషయం తెలుసుకున్న రామాయంపేటలోని సంజీవని దవాఖాన వైద్యుడు అక్కడకు చేరుకుని వైద్యం అందించాడు. యువకుడి పరిస్థితి విషమంగా ఉందని, అప్పటికే శ్వాస అందకపోవడంతో ఈటీట్యూబ్ పరికరంతో కృత్రిమ శ్వాసను అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు ఆక్సిజన్ అందిస్తూ తరలించారు.

డంపింగ్‌యార్డుపై ప్రజాభిప్రాయం సేకరించాలి

రిలే నిరాహార దీక్షలో జేఏసీ నాయకులు

నర్సాపూర్, మార్చి 12: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డుపై ప్రజాభిప్రాయం సేకరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాటికి 24వ రోజుకు చేరుకున్నది. ఈ దీక్షలో నర్సాపూర్ మున్సిపల్ 12వ వార్డుకు చెందిన ప్రజలు కూర్చున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డు ఏర్పాటును ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారన్నారు. దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నగేశ్, రాజేందర్, రమేశ్, యాదగిరి శాఖమూరి తదితరులు పాల్గొన్నారు.

షీ టీంపై విద్యార్థులకు అవగాహన

వెల్దుర్తి, మార్చి 12: మహిళల రక్షణకు షీ టీం బృందాన్ని ఏర్పాటు చేసినట్లు టీం హెడ్ కానిస్టేబుల్ దేవదాస్ తెలిపారు. బుధవారం వెల్దుర్తి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు అవగాహన కల్పించారు. బాలికలు, యువతులు, మహిళల వెంట పడినా, వేధించినా, శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేసినా వెంటనే పోలీసులు, షీ టీంకు ఫిర్యాదు చేయాలన్నారు. విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది స్వరూప, గంగామణి, రవి, హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొప్పలు చెప్పడం తప్ప హామీలు నెరవేర్చేదిలేదా?

నర్సాపూర్, మార్చి 12: కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప హామీలు నెరవేర్చక పోవడం బాధాకరంగా ఉందని రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్ ఎద్దేవా చేశారు. విలేరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. పంట రుణమాఫీ 50 శాతం కూడా మాఫీ చేయకపోవడం, రైతుభరోసా ఇవ్వకపోవడం దారుణమన్నారు.

వీఆర్ఏ వారసుల ముందస్తు అరెస్ట్

పోలీస్ స్టేషన్‌లో వీఆర్ఏల వారసులు

నిజాంపేట, మార్చి 12: నిజాంపేటలో వీఆర్ఏ వారసులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్ చేశారు. 61 ఏండ్లకు పైబడిన వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి వారి వారసు లు అనిల్, తిరుపతి, భాస్కర్, నవీన్, అజీజ్‌మియా హైదరాబాద్ గాంధీభవన్‌కు వెళ్తున్నారని, ముందస్తు పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు.

మంజీరా పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

రామాయంపేట, మార్చి 12: విద్యార్థులను సన్మార్గంలోకి నడిచాలని చైల్డ్ సీనియర్ మేనేజర్ అండ్ ట్రైనర్ స్కాలర్ ప్రోగ్రాం ఇన్‌చార్జి రాజేశ్వరి అన్నారు. బుధవారం పట్టణంలోని మంజీరా విద్యాలయంలో యూకేజీ విద్యార్థులకు ఒకటో తరగతి ప్రవేశానికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సురేశ్‌కుమార్, కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యకు 15 శాతం కేటాయించాలి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 12: రాష్ట్ర బడ్జెట్ లో విద్యకు 15 శాంత నిధులు కేటాయించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో జి ల్లా కేంద్రంలోని జ్యోతి బాపూలే విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామన్న హామీని విస్మరించిందన్నారు. 2024-25లో 6.3 శాతం నిధులు కేటాయించి హామీని తుంగలో తొక్కిందన్నా రు. పాదయాత్రగా కలెక్టరేట్‌కు వెళ్లి డీఈవో రాధాకిషన్‌కు వినతిపత్రం అందజేశారు. పాదయాత్రలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుభాషి సంజీవులు, నాయకులు పోచయ్య, చంద్రం, రాజు, యాదుల్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

మెదక్‌లో ఎస్సీ సంక్షేమాధికారి శశికళను సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి: మహమ్మద్ నగర్‌లో గిరిజన మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్

- సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం
- వ్యాపార, వృత్తి, ఉపాధి రంగాల్లో గణనీయాభివృద్ధి
- ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): బాల్య వివాహాల రహిత జిల్లాగా మెదక్‌ను తీర్చిదిద్దాలని ఇందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు సంఘటితంగా పోరాడాలన్నారు. 80 శాతం మహిళలే జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. వరకట్నం, గృహహింస కేసులు అరికట్టడానికి నడుంబిగించాలన్నారు. ఆడ, మగ మధ్య వ్యత్యాసం చూడకూడదన్నారు. వ్యాపారం, వృత్తి, ఉపాధి రంగాల్లో మహిళల పాత్ర గణనీయమని, ఆర్థికాభివృద్ధి కలిగి ఉండాలన్నారు. ఐడీవోసీని పరిశుభ్రంగా ఉంచుతున్న మహిళా శానిటేషన్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులను సత్కరించి, బహుమతులు అందజేశారు. వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉత్తమ ఉద్యోగులను ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రత్యేకంగా క్రీడలు నిర్వహించి, గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. మహిళామణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీడబ్ల్యూవో హైమావతి, అడిషనల్ డీఆర్డీవో సరస్వతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి, ఎస్సీ సంక్షేమ అధికారి శశికళ, గిరిజన సంక్షేమ అధికారిని నీలిమ, మెప్మా పీడీ ఇందిరా, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, సీడీపీవోలు స్వరూప, హేమభార్గవి, వెంకటరమణ, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్, ధరణి ప్రక్రియ చేపట్టాలి

కౌడిపల్లి, మార్చి 12: రిజిస్ట్రేషన్,ధరణి ప్రక్రియ సరిగా జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కౌడిపల్లి తహసీల్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ ఆంజనేయులు, సింబందితో మాట్లాడారు. రికార్డులు భద్రపరిచే గది, వీడియో కాన్ఫరెన్స్, రిజిస్ట్రేషన్ గదులు, ధరణి పనితీరును పరిశీలించారు. రికార్డులను జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. సర్వర్ ఎలా పనిచేస్తుందని తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాలు చేయాలన్నారు.

యాసంగి సాగు పంటలపై అవగాహన

యాసంగిలో వరి పంట కాకుండా, ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామ పరిసర ప్రాంతాల్లో యాసంగిలో బోరు బావుల కింద సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. పంటల పరిస్థితి ఏవిధంగా ఉంది, ఏరకం ధాన్యం వేశారు. ఎంత విస్తీర్ణంలో వేశారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బోరుబావుల కింద సాగవుతున్న వరి ఏ స్థాయిలో ఉంది, నీటి లభ్యత ఏ మేరకు ఉంది. పంట చేతికొచ్చేందుకు ఎంత సమయం పడుతుంది, ఎన్ని తడులు కావాలని రైతులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలు అందించాలని ఆదేశించారు. సాగునీటి విషయమై అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి ఉన్నారు.

ఎరువులు మోతాదులో వాడుకోవాలి

- మహిళా రైతుల అభివృద్ధే సెహగల్ ఫౌండేషన్ లక్ష్యం
- మేలు రకం విత్తనాలు అందించేందుకు కృషి

మినీ కిసాన్ మేళాలో పాల్గొన్న ఆదర్శ మహిళా రైతులు, కంపెనీ ప్రతినిధులు

చేగుంట, మార్చి 12: మోతాదులో పంటలకు తగ్గట్లుగా ఎరువులు వాడుకోవాలని తహసీల్దార్ నారాయణ, మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని వడియారం గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సెహగల్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు మినీ కిసాన్ మేళాను నిర్వహించారు. 10 గ్రామాల్లో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించిన విత్తనాలతో సాగుచేసి ఆదర్శంగా నిలిచిన మహిళా రైతులు, ప్రగతిశీల మహిళా రైతులను సన్మానించి, మెమోంటోలను అందజేశారు. సెహగల్ ఫౌండేషన్, హైటెక్ సీడ్ కంపెనీ సహకారంతో మేలు రకం కూరగాయాలు, మొక్కజొన్న తదితర విత్తనాలను అందించి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో సెహగల్ ఫౌండేషన్ ప్రోగాం ఆఫీసర్ వాణిశేఖర్, డాక్టర్ రవి, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త, హైటెక్ సీడ్ మేనేజింగ్ డైరెక్టర్ మోయినొద్దీన్, హుస్సేన్, కంధ్పనీ ప్రతినిధులు బిందు, డాక్టర్ విభ, డాక్టర్ గాయత్రి, మహిళా రైతులు పాల్గొన్నారు.

పరిమితంగా ఎరువులు వాడాలి

ఎరువుల దుకాణాన్ని తనఖీ చేస్తున్న డీఏవో వినయ్

పాపన్నపేట, మార్చి 12: అవసరం మేర పరిమితంగా ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి వినయ్ అన్నారు. బుధవారం పాపన్నపేట, చిత్రియల్, డిసీఎంఎస్ ఎరువుల దుకాణాల రికార్డులను తనిఖీ చేశారు. నాణ్యమైన ఎరువులు విక్రయించాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాల మేరకే ఎరువులను వాడాలని సూచించారు. ఆయన వెంట ఏవో నాగమాధురి ఉన్నారు.

ఆరుతడి విధానాన్ని పాటించాలి

వెల్దుర్తి, మార్చి 12: భూగర్భ జలాలు అడుగంటడం, ఉష్ణోగ్రతలు పెరుడుతుడడంతో వరికి ఆరుతడి విధానాన్ని పాటించాలని ఏవో ఝూన్సీ సూచించారు. తీవ్ర నీటి ఎద్దడి ఉన్నందున పంటలు ఎండిపోయే ప్రమాదంపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. బుధవారం మండలంలోని ఆరెగూడెం, ఎలుకపల్లి గ్రామాల్లో నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న పలువురు రైతుల పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ ఈ ఏడాది భూగర్భ జలాలు తగ్గాయని, నీటి ఎద్దడి కారణంగా పంటలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

చిలిపిచెడ్, మార్చి 12: మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 300 మందికి చండూర్‌కు చెందిన చౌటకూరి గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పరీక్షా సామగ్రిని బుధవారం అందజేశారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, మార్చి 12: నర్సాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న 64 మంది విద్యార్థులకు ఏవో మిట్టపల్లి దీపిక ఆమె తల్లి లక్ష్మి సమక్షంలో పరీక్షా సామగ్రిని బుధవారం అందజేశారు.

'ప్రభుత్వ భూమి కాదు మా పట్టా భూమి'

ఎమ్మార్వోకు వినతి పత్రం ఇస్తున్న దేవులతండావాసులు

కౌడిపల్లి, మార్చి 12: మండలంలోని తునికి దేవుల తండాలోని 245 సర్వేనంబర్‌లో ఉన్న 2 ఎకరాలు మా పట్టా భూమి అని బుధవారం ఎమ్మార్వోకు కార్యాలయానికి వచ్చి తండాకు చెందిన కాట్రోత్ జగన్, ఎల్ జమున, కె లక్ష్మణ్, కె రాజెందర్, కె నరేందర్, రవీందర్, పలువురు గిరిజనులు వినతి పత్రం అందజేశారు. 245లో బై నంబర్లతో మొత్తం 8 ఎకరాల విస్తీర్ణంలో తమ తాతముత్తాతల నుంచి కాస్తులో ఉన్నామని వారు తెలిపారు. గ్రామస్తుల విన్నపం మేరకు ఈ నంబర్‌లో ఒక ఎకరం భూమిని రైతువేదిక, వైకుంఠ ధామానికి దానం చేశామని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 11 డబుల్ డెడ్‌రూం ఇండ్ల స్థలం కబ్జా అని తమకు ఇచ్చిన ఫిర్యాదు అవాస్తవమని వారు తెలిపారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

మెదక్ మున్సిపాలిటీ: స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చేగుంట: రెడ్డిపల్లి పాఠశాలలో..

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 12: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తొటి వారికి పాఠాలు బోధించారు. ఉత్తమంగా పాఠాలు బోధించిన విద్యార్థులకు హెచ్ఎం వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయులు నర్సింగ్‌రావు, శిరిష, వినయ్ బహుమతులు అందజేశారు.

రెడ్డిపల్లి పాఠశాలలో ..

చేగుంట, మార్చి 12: స్వయం పాలనతో విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం నవాత్ సురేశ్ తెలిపారు. మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పాలన జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటివారికి పాఠాలు బోధించారు. ఉత్తమగా బోధించిన వారికి హెచ్ఎం నవాత్ సురేశ్, ఉపాధ్యాయులు సుమతి, రజనీదాస్, రామకృష్ణ, సుమలత బహుమతులు అందజేశారు.

చేగుంటలో ఆర్థిక సాయం

చేగుంట, మార్చి 12: చేగుంటకు చెందిన మురాడి భారతి మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని అయిత పరంజ్యోతి పరామర్శించి దశదిన కర్మకు 50 కిలోల బియ్యం, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. సొసైటీ డైరెక్టర్ రఘు రాములు, చేగుంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి, కుర్ర లక్ష్మణ్ తదితరులున్నారు.

'గీతా' టీచర్‌కు జాతీయ బహుమతి

వజ్జ రాజేశ్వర్

తూప్రాన్, మార్చి 12: తూప్రాన్‌లోని గీతా స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వజ్జ రాజేశ్వర్‌కు లేఖా రచన పోటీలో జాతీయ స్థాయి (తెలంగాణ సర్కిల్) తృతీయ బహుమతి లభించింది. డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాముఖ్యత అనే అంశంపై తపాలా శాఖ గతేడాది డిసెంబర్‌లో ఈ పోటీ నిర్వహించింది. తెలుగు సాహిత్యంపై పట్టున్న టీచర్ రాజేశ్వర్ లేఖా రచనలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ధ్రువ పత్రంతో పాటు రూ.5 వేల నగదు బహుమతి అందివ్వనున్నట్లు తపాల శాఖ అధికారులు తెలిపారు. కరస్పాండెంట్ పి.రామాంజనేయులు, చైర్‌పర్సన్ ఉష, ప్రిన్సిపాల్ వెంకట కృష్ణారావు ఆయనను అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

చిన్నశంకరంపేట, మార్చి 12: చిన్నశంకరంపేట బస్టాండ్ వద్ద ఎన్నారై కంచర్ల చంద్రశేఖర్ సౌజన్యంతో చలివేంద్రాన్ని తహసీల్దార్ మన్నన్ ప్రారంభించారు. ఏఎస్సై లక్ష్మణ్, స్వామి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

శివ్వంపేట, మార్చి 12: మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన దాసరి భూమయ్య అనారోగ్యంతో నిమ్స్‌లో వైద్యం చేయించుకుంటున్నారు. ఎల్‌వోసీ కోసం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సహకారంతో దరఖాస్తు చేసుకున్నారు. రూ. 2లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. బుధవారం బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతస్వామి, ముండ్రాతి బాలేశ్, దేవాలయ కమిటీ ఛైర్మన్ పిల్లి శివకుమార్, బుర్ర పోచాగౌడ్, పుల్లయ్య, జనుముల గణేశ్, కమ్మరి సురేశ్, సంద్ర సత్యనారాయణ, చింత శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభంలో తోపులాట

- ఎమ్మెల్యే సునీతారెడ్డి లేకుండా ఎలా ప్రారంభిస్తారని మండిపడ్డ బీఆర్ఎస్ నాయకులు

లచ్చిరెడ్డిగూడెంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

శివ్వంపేట, మార్చి 12: మండలంలోని లచ్చిరెడ్డిగూడెంలో సీసీరోడ్డు పనుల ప్రారంభంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట జరిగింది. సీసీరోడ్డు నిర్మాణానికి రూ.17లక్షల నిధులు మంజూరు కావడంతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి బుధవారం ప్రారంభించేందుకు వచ్చారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నవాబ్‌పేట మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సునీతారెడ్డి లేకుండా పనులు ఎలా ప్రారంభిస్తారని, ప్రొటోకాల్ ఉల్లంఘిస్తారా అని ప్రశ్నించారు. ఉద్రిక్తతల మధ్య కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మరుగుదొడ్ల అపరిశుభ్రతపై జడ్జి ఆగ్రహం

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్జి జితేందర్

మెదక్ అర్బన్, మార్చి 12: జిల్లా కేంద్రంలోని వెస్లీ పాఠశాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్, ఎంఈవో నీలకంఠంతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. అక్కడి పిల్లలు వినియోగించే మరుగుదొడ్లు అపరిశుభ్రంగా, దుర్గంధభరితంగా నిర్వహణలేమినితో ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల మరుగుదొడ్ల పరిసరాలు చెత్త, పొదలతో నిండి ఉండబం చూసి బాలల హక్కుల ఉల్లంఘనగా, గౌరవభంగంగా ఉంటుందన్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. తక్షణ చర్యలు చేపట్టి మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని ఆదేశించారు.

గ్రూప్ 2లో విజయ్‌సేనారెడ్డికి 259 ర్యాంక్

చేగుంటలో విజయ్‌సేనారెడ్డిని సన్మానిస్తున్న అయిత పరంజ్యోతి

చేగుంట, మార్చి 12: మక్కరాజిపేట పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అల్లి విజయ్‌సేనారెడ్డి, గ్రూప్-2 ఫలితాల్లో 259 ర్యాంక్ సాధించారు. జిల్లా వాలీబాల్ ఆసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి బుధవారం ఆయనను సన్మానించారు. టీచర్లు చల్లా లక్ష్మణ్, రామకృష్ణ, జగన్‌లాల్, యాదగిరి, అయిత రఘురాములు, సుధాకర్ తదితరులున్నారు.

వెంకటేశ్‌కు బంగారు పతకం అందజేత

నిజాంపేట, మార్చి 12: నస్కల్ గ్రామానికి చెందిన గోషిక వెంకటేశ్ హర్యానా, హిస్సార్ గురు జంబేశ్వర్ విశ్వవిద్యాలయంలో బీటెక్ ప్రింటింగ్, ప్యాకెజ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 10న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ద్వారా వెంకటేశ్ బంగారు పతకాన్ని పొందాడు.

విహార యాత్రలో విద్యార్థులు

నిజాంపేట, మార్చి 12: నస్కల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విహార, విజ్ఞాన యాత్రకు బుధవారం కామారెడ్డి జిల్లా దోమకొండలోని పురాతన కోటకు వెళ్లారు.

పుట్టిన రోజు వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే

అల్లాదుర్గం, మార్చి 12: బీఆర్ఎస్ మండల నాయకుడు పవన్‌కుమార్ పుట్టిన రోజును బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మాజీ ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.